# అదృష్టకేళి ×

రచన :
శ్రీ బులుసు-జీ-ప్రకాష్

అపహరణ నేరం అక్రమంగా మోపబడిన సదానందాన్ని, జామీనుగా ఉండి, తాత్కాలికంగా ఖైదునుండి విడుదల చేయించాడు. శైలజారావు.

శైలజారావుని ఒక్కమారు హత్తుకుని-'నీకుచాలా కృతజ్ఞుణ్ని రా శైలజా!' అని జాలిగా అన్నాడు సదానంద్.

'అబ్బే-ఎంతమాట! ఇందులో నే చేసినదేమీ లేదు. పరమేశ్వరుడిచ్చిన కొద్దిశక్తి నీవిని యోగించాను అంతే. అది నా విధి కూడాను' అన్నాడు శైలజారావు-'నీ గ్రంథం ఎంతవరకూ వచ్చింది?'

'సర్వాన్నీ శాసించేవాడు జగన్నియంత ఐన జగదీశ్వరుడే! ఆయన చేతిలో ఉండేదే అదృష్టచక్రం. ఒక్కొక్కప్పుడు, ఆయనకుగల అదృష్టచక్రానికి ఆయనే లోబడిపోతూంటాడు. తప్పదు కూడాను. ఆ అదృష్టచక్రం అలా ఒక్కొక్క విధంగా అన్నిటినీ ఆటలాడిస్తూంది. అదోరకమైన అందం!' అన్నాడు సదానంద్.

'మంచి అందమే! ప్రథమశ్రేణి వ్యక్తుల్ని అధమశ్రేణికి మారుస్తుంది. అధముల్ని ప్రథమశ్రేణికి. మందకొడి వెధవల్ని అందలా వెక్కిస్తుంది. అందాలా వెక్కవలసినవాళ్లని... వైస్ వెర్సా!' అదృష్టకేళిని గేలిచేశాడు శైలజారావు.

'అదృష్టకేళిని చూసి ఎగతాళిచేయకూడదు మనం. నవ్వి నమస్కరించవలసిందే! మహామహుల్నీ, హేమాహేమీల్నీ అది ఆటలాడించింది. ఇంకా అదృష్టకేళిని గురించి వివరంగా చర్చచేయమంటావా?' ప్రశ్నించాడు. సదానంద్.

'ఎందుకు? చర్చించి మనంచేసేదేముంది?'

'లేకపోవచ్చు కాని దాని కేళికి, అది వంధ్యమా కాదా అనే నిర్ణయానికిమాత్రం రావచ్చు'

'ఐతేచెప్పు వింటాను.' అన్నాడు శైలజారావు.

'మహావిష్ణువు పది అవతారాల నెందుకు ఎత్తవలసివచ్చింది? లోకాలకు భిక్షపెట్టే శంకరుడు, తానెందుకు భిక్షమెత్త వలసివచ్చింది? శివుడుయోగి. విష్ణువుభోగి. మాధవుడు ధని. ఉమాధవుడు నిర్ధని. ఇవి అదృష్టకేళి కాక మరేమిటి?' అన్నాడు సదానంద్.

దూరంగా వినిపించే బేండుమేళాలు క్రమానుగతంగా దగ్గరకు వినవస్తున్నాయి. తెల్లవారితే మినర్వాలో రాజ్‌కపూర్స 'ఫోర్ ట్వెంటీ' విడుదల. ఆ చిత్రప్రచారం అది ప్రఖ్యాత దర్శకనిర్మాతనటచక్రవర్తి రాజ్‌కపూర్.

'మొదట్లో ఈరాజ్‌కపూర్ ఎవరో తెలుసా! శైలజా!' అన్నాడు సదానంద్-'స్కూల్ ఫైనల్ డింకీఫెడ్ సరుకు ఎందుకూ స్వతహాగా పనికిరాడనే పరిస్థితి. ఒక స్టూడియోలో సాడే ముప్పాతిక నౌకరీలో ప్రవేశించాడు. రానురాను అదృష్టంకలిసొచ్చింది. ఇప్పుడతన్ని ఉపమించేవారు హిందీ చిత్రరంగంలో బహు అరుదు. పుట్టగానే తానింతవాడి నవుతానని అను

కున్నాడా? స్కూల్ ఫైనల్ తప్పినప్రతివిద్యార్థి రాజ్ కపూరంతటివా డౌతున్నాడా?-అంతెందుకు శైలజా! పుట్టగానే నెహ్రూపండితుడు దేశ ప్రధాని నవుతాననుకున్నాడా; లేక రాజెన్ బాబు ప్రసిడెంటు నవుతాననుకున్నాడా? ఇది అదృష్టకేళికాక మరేమిటి?'

ఔనన్నట్లు తల పంకించాడు శైలజారావు.

*　　　*　　　*

సోమవారం. పరమశివాలయంలో గంటలు అవారితంగా మ్రోగుతున్నాయి. భక్తులు తండోపతండాలుగా విచ్చేస్తున్నారు. పరమ శివునికి పాలు, నారికేళాలు తీసికెళుతున్నారు. బైటకూర్చున్న భిక్షువులు, ప్రసాదాలు అర్థిస్తున్నారు; పూజలు ముగించుకుని వస్తున్న భక్తుల్ని

'బాబూ! అమ్మా! చంటిబిడ్డకు ఓ యిన్ని పాలుపొయ్యండి.' అని ప్రాధేయ పడుతూందొక పేదరాలు. పైపెచ్చు బాలెంతరాలు కూడాను. పాపం ఆమెకు ఆహారంలేకపోవడం వల్ల, బిడ్డకు పాలివ్వడానికి స్తన్యం శూన్యమైంది. బిడ్డ అపుదలలేకుండా కెవ్వున కేకలు పెడుతూంది.

పరమశివుని శిలావిగ్రహానికి అభిషేకం చేయించాలని పెద్ద వెండిచెంబుతో పాలు నిండుగా తీసికెడుతున్నాడు, భక్తాగ్రణి శ్రేష్ఠి ఒకడు.

'బాబూ! దేవునికి అభిషేకం అయిన తర్వాత ఈశిశువుకి గొక్కెడు పాలుపొయ్యండి. నాదగ్గర పాల్లేవు' అని అర్థించిందా పేదరాలు.

'ఇవి నీకోసం కా తల్లీ! దేవునికి దేవుడయ్యాక మా కుటుంబానికి ప్రసాదంపట్టుకెళ్లాలి. నీకు స్తన్యంలేకపోవడం నీ అదృష్టం అది ఎవరి అదృష్టానికి ఎవరు బాధ్యులు?' అంటూ దాటేశాడు శ్రేష్ఠి.

పేదరాలు కన్నీరు జొటజొటా రాల్చింది.

'చూశావా శైలజా! శ్రేష్ఠిగారి శివభక్తి?' నవ్వుతూ అన్నాడు సదానంద్_'శివుడు ఆ శిలలోనే ఉన్నాడా? లేక ఆబిడ్డ ఆక్రందనలో ఉన్నాడా?'

శైలజారావు విచారంగా ముఖంపెట్టాడు. ఏమీ మాట్లాడలేకపోయాడు.

'బిడ్డతాలూకు ఆకలితో కూడిన ఆక్రందన చూసి, గుడిలోని శిల వికతాళి చేస్తున్నది సుమా, శైలజా!'

'ఔను సదానంద్! నేను చాలా బాధపడుతున్నాను.'

'వ్యక్తులతీరే అంత లేవోయ్ శైలజా! ఈ బాలెంతరాలి అదృష్టం అలావుంది. కాని, శైలజా! పరమశివుడు తనకు క్షీరాభిషేకం చేయించకుండా-ఆశిషువుకి పాలుపోసి ఆసువులు కాపాడితే ఇంకా ఎక్కువగా ఆ భక్తుణ్ని హర్షించేవాడు కదూ! పాపం, శ్రేష్ఠిగార్కి అంతజ్ఞానం ఎక్కడేడిసింది? ఇది అదృష్టకేళికాక మరేమిటంటావ్ శైలజా!' అపహాసించాడు సదానంద్.

'ఔను సదానంద్! ఇది అదృష్టకేళి!'

*　　　*

'ఆ వెళుతున్నవ్యక్తి ఎవరో తెలుసునా, శైలజా?'

'తెలీదు సదానంద్!'

'నాలుగేళ్ల క్రితమే ఆతను ఎం.ఎ. పాసయ్యాడు ఎక్కడా ఉద్యోగం దొరకలేదు. కడకు ఒక మార్వాడీ దగ్గర డెబ్భైరూపాయలకు, పద్దులు వ్రాయడానికి అమ్ముడుపోయాడు. మార్వాడీ ఏమో విద్యావిహీనుడు. లక్షలమీద వ్యాపారం చేస్తున్నాడు. ఎల్లాగ? ఈ విద్యాధికునిచేత పని చేయించి, తాను వ్యాపారాభివృద్ధి చేసుకుంటున్నాడు, కానీ, మనవాడి జీతానికి అభివృద్ధి లేదు. జీతానికి అభివృద్ధిలేనిదే జీవితానికి మాత్రం అభివృద్ధి ఎక్కడిది?

– చదువులేకుండా తాను లక్షల గడిస్తూ చదువుకున్న ఇతన్ని తనకాలుక్రింద అణగద్రొక్కాడు. చదువుకున్నవాడి అదృష్టానికీ చదువులేనివాడి అదృష్టానికీ భేదం గుర్తించావా శైలజా? ఇది అదృష్టకేళికాక మరేమిటి?' ప్రశ్నించాడు సదానంద్.

'నిజం సదానంద్! ఇది అదృష్టకేళి!' అన్నాడు శైలజారావు.

'ఏమిరా సదానంద్! ఇవాళ కార్తీక సోమవారం. కప్పుకాఫీకైనా డబ్బుల్లేవు. రెండణాలిద్దూ! నిన్ను దీవిస్తాను' అన్నాడొక ముదుసలి. బాగా పరిపక్వమైన గెడ్డాలు, శివజటాజూటానికి మల్లే పొడవైన జడలు.

సదానంద్ రెండణాలిచ్చి ఆ వృద్ధుణ్ని పంపించివేశాడు. 'విజయోస్తు, అని, ఇంకేవేమో శ్లోకాలు వల్లి చుకుంటూ వృద్ధుడు వెళిపోయాడు.

'అతనెవరో పోల్చుకున్నావా, శైలజా?'

'ఆఁ ఎవరో పిచ్చివాడై వుంటాడు. అంతకన్నా ఏముంది?'



'చెంచులక్ష్మి' లో ఒక దృశ్యం.

'నువ్వనుకున్నట్లు అతను తేలిక్కైన మనిషి కాదు శైలజా! నువ్వే కాదు. అందరూ అలానే భావిస్తున్నారు. సారస్వతశాఖాసకల రచనా కుశలుడాయన!'

'ఐతే ఆయన ప్రభుత్వదృష్టిలో పడకపోవడానికి కారణం? అటువంటి మహనీయుల్ని ప్రభుత్వం వారు స్వయంగా ఆహ్వానించి సింహాసనం ఎక్కించవద్దా, సదానంద్?'

'నిజమే శైలజా! ఇప్పటి ప్రభుత్వ పరిస్థితులే వేరుకదా? మనిషిలోవున్న గొప్పవిశేషాలను గుర్తించలేదు ప్రభుత్వం. మూర్ఖుల్ని గద్దీ ఎక్కిస్తుంది. ఒక దొంగను పట్టుకుందికి ఎంతో మంది సి.ఐ.డీలచేతఅన్వేషింప జేస్తుంది. కాని మహత్త్వ కవిత్వపటుత్వ సంపదలు గల మహామనిషిని అన్వేషించి, పట్టుకుని, అతని అర్హతకు తగినస్థానం చూపలేదు ప్రభుత్వం! ఇదె మరి...'

'నాకు తెలుసు సదానంద్! ఇది అదృష్ట కేళే!' అందుకున్నాడు శైలజారావు.

*　　*　　*


కోర్టుహాల్లోంచి జడ్జీగారు గట్టిగాఅరుస్తున్నారు.

'సదానంద్! ఒక విధంగా నేను మీకు క్షమాపణ చెప్పుకుంటున్నాను. మీ పైగల చౌర్యనేరం ఉపసంహరించుకుంటున్నాం, ఆభరణాలను అపహరించిన అసలుదొంగ, సర్వ వస్తుచయంతోనూ పట్టుబడ్డాడు!'

'నువ్వు చాలా అదృష్టవంతుడివి సదానంద్!' అంటూ శైలజారావు ప్రియమిత్రుణ్ని బిగియార కౌగిలించుకున్నాడు.

'అదృష్టవంతుణ్ని నేనుకాదు శైలజా! అదృష్టకేళిలో తేలియాడినవాణ్ని! అదృష్ట కేళికి జోహార్!' పెద్దగా అరిచాడు సదానంద్!

'అదృష్టకేళికి జోహార్!' పునరుచ్చరించాడు శైలజారావు.



భారత్ ప్రొడక్షన్సు వారి తమిళ చిత్రం 'విక్రమాదిత్యన్' లో ఒక దృశ్యం.